## మినీకథ



# పరిచయం

వి.ఎ. మాణిక్యాంబ

జీవితం ఒక రైలు ప్రయాణం లాంటిది. ఇందులో ఎన్నో మజిలీలు. ఎన్నో అనుబంధాలు. ఎన్నో మరపురాని సంఘటనలు.... ఆమె నన్ను మరచిపోవచ్చు కాని. నేనుమటుకు మరువలేను. ఏం జరిగిందంటే .......”

అవి వానాకాలం రోజులు....

ఆరోజు కంపార్ట్‌మెంట్ అంతా దరిదాపు ఖాళీగా వుంది. బహుశా పిల్లల సెలవులయిపోవటం వలన. బిజినెస్ సీజన్ కాకపోవటంవలన గామోసు. కంపార్ట్‌మెంట్‌లో చాల కొద్ది మంది మటుకే ఉన్నారు. రైలు స్పీడు తగ్గింది. మెల్లగా స్టేషన్ చేరింది.

‘లోనావాల చిక్కీ’ ‘లోనావాలచిక్కీ’. అబ్బాయి గట్టిగా అరుస్తున్నాడు. అప్పుడే ‘లోనవాల’ వచ్చేసిందనుకొన్నాను. ఇంతలో ఒక అమ్మాయి హడావిడిగా, కిటికీ ప్రక్కనున్న ఎదురు సీటులో వచ్చి కూర్చుంది. అమ్మాయి అమ్మా. నాన్న అనుకుంటాను. అన్ని జాగ్రత్తలు చెపుతున్నారు. అపరిచయస్థులతో మాట్లాడవద్దని చేతులు పైకి పెట్టద్దని. ఆమె ‘అలాగే ... అలాగే’ అంటూ సూటుకేసు దగ్గరగా జరుపుకుంది.

ప్రపంచమే ఒక ఉద్యానవనం. రంగు రంగుల పూలతో. తీగలతో. మొక్కలతో. చెట్లతో తోటలు అందాలు వెదజల్లుతున్నట్లే ఈ జనావళిలో కూడా చిత్ర, విచిత్ర వేషధారులు. భాషలు. హావభావాలు.... గమనిస్తుంటే చాల విచిత్రంగ, సరదాగా వుంటుంది. సప్త రంగులతో. కళాకాంతులతో నిండిన ఈ ప్రపంచాన్ని చూసి ఆనందించే వాళ్ళెందరు? పసిమి కాంతులీను బంతిపూలను, ముద్ద మందారాలను చూసి భగవంతుని సృష్టిని మెచ్చుకొనేవాళ్ళు కొందరే ఉంటారు. సర్వేంద్రియాలలో కళ్ళు చాల ముఖ్యమయినవి. కళ్ళులేని జీవితం చాల కష్టం. అదొక అగాథం.... శూన్యం!

యుద్ధంలో గాయపడిన నా కళ్ళు మళ్ళీ ఈ జగత్తును చూడటానికి పనికిరాకుండాపోయాయి. ఇప్పుడు చెవులే నా కళ్ళు! శబ్దం, వాసన, రుచి.... వీటినిబట్టి ఏంజరుగుతోందో ఏదేమిటో తెలుస్తోంది.

చప్పుడునిబట్టి ఆ అమ్మాయి గాజు గాజులు రెండు చేతులకూ వేసుకుందని గ్రహించాను. గొంతు బాగుంది. మనిషి కూడా బాగుండచ్చు!

“మీరుకూడా బొంబాయి వస్తున్నారా?” అని అన్నాను. చిన్న ఊపుతో బయల్దేరిన రైలు వేగం పుంజుకుంది.

“....................”

బహుశ అపరిచయస్థులతో మాట్లాడద్దని చెప్పిన విషయం ఆ అమ్మాయికి గుర్తుండచ్చు.

“మీరుకూడా బొంబాయి వస్తున్నారా?” గొంతు కాస్త హెచ్చించి అడిగాను.

“క్షమించండి. నన్నడిగారనుకోలేదు” తియ్యగా, నెమ్మదిగా వుంది ఆమె స్వరం.

“ఫరవాలేదు. బొంబాయివెళ్ళే రైలు ఎక్కినప్పుడు అక్కడికి వస్తున్నారా అని అడగటం తప్పేననుకోండి”. సంభాషణ కొంత సాగిద్దామని అన్నాను.

“అట్నే దానిదేముందండి నేను దాదర్ వరకు వస్తున్నాను. అక్కా, బావ స్టేషన్‌కి వస్తామని క్రిందటి వారం ఉత్తరం వ్రాశారు. మీరు బొంబాయిలో ఎక్కడుంటారు?” అందామె.

“జుహూ బీచ్ దగ్గర మా అన్నగారిఇల్లు ఉంది. మా అన్న దగ్గర కొన్నాళ్ళు ఉందామని వెళ్తున్నాను.” సిగరెట్టు వెలిగించుకుంటూ అన్నాను.

“ఓహ్! జుహూ బీచ్ దగ్గర మీ ఇల్లు. చాలా అదృష్టవంతులండి. రోజూ బీచ్‌కి వెళ్ళచ్చు. సంధ్యాసమయంలో ఎంత బాగుంటుందండి. ఒంటెమీదకూర్చుని తిరుగుతూ ఉంటే చాల సరదాగా ఉంటుంది.” చిన్ననాటి విషయాలు గుర్తుచేసుకుంటూ అంది.

“వర్షం చాల బాగా పడుతోంది” అన్నాను కిటికీ షట్టర్సు కిందికి లాగుతూ.

“ఊఁ” అందామె.

ఈసారి కాస్త ధైర్యం చేసి “మీరు బాగుంటారండి” అన్నాను. నల్ల కళ్ళజోడు కొంచెం పైకి సర్దుకొంటూ.

“థాంక్స్. చాల మంది అలాగే అంటారు” అంది ఆమె.

ఈమె నిజంగానే బాగుంటుంది కామోసు అనుకున్నాను పొడుగుపాటి జడ. తీరయిన ముఖం. విశాలమైన నేత్రాలు. దానిమ్మ గింజల్లాంటి పళ్ళు. చెంగావి రంగు చీర కట్టుకున్న అందమయిన అమ్మాయి నాకు అంతర్లీనంగా కనిపించింది.

“...........!?”

“...........!?”

వాన పూర్తిగా తగ్గిపోయినట్లుంది. ఆ అమ్మాయి కిటికీ షట్టర్స్ పైకి ఎత్తింది. ఇంతలో దాదర్ స్టేషన్ వచ్చేసింది. ప్రయాణం తొందరలో ముగిసినందుకు నాలో నేను సంతోషించాను. ఆ అమ్మాయి బావ సూట్‌కేస్ తీసుకుని నడుస్తుండగా “వస్తానండి” అని చెప్పి ఆఅమ్మాయిరైలు దిగి వెళ్ళిపోయింది.

ఇంతలో ఇంకొక వ్యక్తి వచ్చి ఎదురు సీటులో కూర్చున్నాడు. అతను మాట్లాడే భాషను బట్టి, తెలుగు రాదనుకొన్నాను. కుతూహలంతో అడిగాను. “అభీ ఏక్ లడ్‌కీ యహాఁసే చెలీ గయీనా! ఓ కైసీ హై?”

“బహూత్ సుందర్ లడ్‌కీ హై”, తమలపాకు నములుతూ అన్నాడు.

“పర్ క్యా ఫాయిదా, ఓ అంధీ హై” అన్నాడు.

రైలు భారంగా బయల్దేరి వి. టి.ని చేరు కోటానికి వేగం పెంచుకుంది. నాకు చాలా బాధ అనిపించింది. ఆలోచనలమీద ఆలోచనలు సముద్రపు కెరటాల వలె, ఒకదానిమీద ఒకటి రావటం మొదలుపెట్టాయి. విశాలమయిన నేత్రాలు.... తీరైన ముఖం ....పసిమిఛాయ .... దానిమ్మ గింజల్లాంటి పళ్ళు.... చెంగావి రంగు చీర.... పొడుగైన జడ.... ఆలోచనల నుంచి తేరుకొనేలోగా “విక్టోరియా టెర్మినస్” స్టేషన్ వచ్చేసింది.

●